# 10. మళ్లీ కన్యాశుల్కం

**కన్యాశుల్కం** నాటకాన్ని తలుచుకుని రకరకాల కులాసా కబుర్లు ఎన్నయినా చెప్పుకోవచ్చును కదా.

1980లో జరిగిన ఈ సంఘటన అవధరించండి : -

నేను పనిచేస్తున్న సంస్థకి మేనేజింగు డైరక్టరుగా అప్పారావు గారనే ఒకాయన వచ్చారు. ఆయన ఇక్కడ జాయిన్ కాకముందే ఆయన ఎలాంటి వారూ, ఆయన బలహీనతలు ఏమిటీ అని ఆరా తీసి మా ఎడ్మినిస్ట్రేటివు ఆఫీసరు అందించిన సమాచారం ఏమిటయ్యా అంటే సదరు అప్పారావుగారికి 'లలిత కళలయందు అభినివేశం' ఉందని; సంగీత కచేరీలూ నాటకాలూ కవిత్వాలూ (చేయించడం, వేయించడం, చెప్పించడం) మొదలైన సరదాలున్నాయని.

ఆయన జాయినైన అయిదో రోజున మా జనరల్ మేనేజర్ శ్రీనివాసన్ గారు ఆయన ఛేంబర్సులోకి వేళ్ళేరు. ఆఫీసు పనికి సంబంధించిన మాటలు అయ్యాకా, జి.ఎమ్.గారు "ఇదేమిటి సార్, ఈ పుస్తకాల దొంతర ఇలా నేలమీద ఉంచేశారు? తమకి అభిమతం అయితే వీటికోసం ఒక షెల్ఫ్ పంపిస్తాను." అన్నారు.

"నోనో, మిస్టర్ శ్రీనివాసన్, డోంట్ బాదర్ యువర్ సెల్ఫ్ అవి వొట్టి తెలుగు పుస్తకాలు!"

శ్రీనివాసన్‌గారు ఆ దొంతరల్లోంచి చొరవగా ఒక పుస్తకంలాగి "ఓ, మైగుడ్‌నెస్! సోఫోక్లీజ్ గ్రీకు నాటకం - తెలుగు అనువాదం శ్రీ అప్పారావుగారు! చెప్పేరే కాదు, సార్!"అన్నారు.

"శ్రీనివాసన్ గారూ, మీకు తెలుగు కూడా వచ్చా?"

"అయ్యో, నేను తెలుగు వాణ్ణేనండీ బాబూ! నన్ను రిక్రూట్ చేసిన ఆఫీసరు టమిలియన్. ఆయన శ్రీనివాస్ అనే నా పేరుని శ్రీనివాసన్‌గా ఉదహరించడం వల్ల రికార్డుల్లో అలాగే ఉంది. ఐతే, దానివల్ల ఢిల్లీ లెవెల్లో కొంచెం లాభం ఉంది కదా అని అలా వుంచేసుకున్నాను." అని, ఆ ఎండకి ఆ గొడుగు పట్టేరు జి.ఎం.గారు.

అలాగ అప్పారావు గారు నాటకాలురాస్తారన్న సంగతి "బైటపడిపోయి", ఆ భోగట్టా సాంస్కృతిక సంఘం కార్యదర్శిగారికి ఒక సూచనగా వెళ్లింది; "అప్పారావు గారు రాసిన నాటకం ఒకటి స్టేజి చేస్తే దానికి అయ్యే ఖర్చుల నిమిత్తం రెండు వేల రూపాయలు సంక్షేమ నిధి నుంచి గ్రాంటు చేయబడును."

అప్పటికి పదిరోజుల్లో మా సంస్థ 27వ వార్షికోత్సవం ఉంది. ఆ సందర్భంగా 'కన్యాశుల్కం' ఆడుతామని నోట్‌రాగానే శ్రీనివాసన్‌గారు రెండు వేలు గ్రాంటు చేసి కూడాను, ఇంకో రెండు రోజుల్లో ప్రదర్శన ఉందంటూ వేసిన ఆహ్వాన పత్రం మొసాయిదా చూడగానే ఆ గ్రాంటు కాన్సిల్ చేసేశారు. కల్చరల్ అసోసియేషన్ శెక్రటరీ అప్పటికే సొమ్ము డ్రా చేసి సగంపైగా ఖర్చు పెట్టేశాడు. ఇప్పుడెలాగా, అని లబోదిబోమంటేనూ, "ఆ నాటకం రాసింది ఎవడో గురజాడ అప్పారావుట కదా! నాకు ముందే ఎందుకు చెప్పలేదు? నేను మన ఎం.డి. అప్పారావుగారు రాసిన నాటకమే

వేస్తున్నారనుకొని గ్రాంటు చేసేను. సారీ, ఇప్పుడు నేనేం- చేలేను'' అన్నారు జి.ఎం.గారు.

కన్యాశుల్కం నాటకం బతకడానికి కారణాలు ఎన్ని అయినా ఉండొచ్చుగాని ఆ సాంఘిక దురాచారం నశించిపోడం, దానికి ఉల్టాగా వరకట్న దురాచారం దేశం అంతటా దావా అగ్నిలాగ (ఆమాటకొస్తే కిరసనాయిలు అగ్నిలాగ) విజృంభించడం అందరికీ తెలుసును. టెన్నిసన్ మహాశయుడు చెప్పినట్టు ఒక "మంచి సంప్రదాయం" మరొకదానికి చోటు ఇస్తూ తప్పుకోడం సహజం. ఆ సూక్తి ప్రకారం మళ్లీకాలచక్రం తిరగ్గా తిరగ్గా ఒక ప్రకటన ఎలా రాగలదో అది కూడా చిత్తగించండి:

**జీవితసహచరిణికావలెను :**

*35 సంవత్సరాల వయస్సుగల ఈ ప్రకటన దారునికి ప్రభుత్వ ఉద్యోగం ద్వారా నెలకు పదివేల రూపాయలున్నూ, ఇతర వనరుల ద్వారా ఏడాదికి లక్షరూపాయలున్నూ రాబడి కలదు. ఈ దురదృష్ట జాతకునికి ఒక జీవిత సహచరిణి కావలయును (గమనిక: "వధువు కావలెను" అని కోరడం లేదు.)*

*ఈ ప్రకటనకు బదులుగా అంగీకారం తెలిపే స్త్రీ వయస్సు 40 ఏళ్లకు లోగా ఎంతైనా ఉండవచ్చును. ఒకటి రెండు సార్లు వివాహం చేసుకొని ఉన్నా, ఒకటి రెండు ఎబార్షన్లు చేయించుకొని ఉన్నా, ఒక రిద్దరు బిడ్డలు ఉన్నా కూడా సరే; అభ్యంతరం లేదు.*

*ఏదైనా ఉద్యోగం ద్వారా గాని వృత్తిద్వారా గాని స్వయంగా సంపాదించుకొంటున్న స్త్రీలు మా జోలికి రావద్దని మనవి. ఎంతో కొంత చదువుకొని ఉన్నా, "గృహిణి"గా జీవించడానికి ఇష్టపడే వారు మాత్రం దయవుంచి తమ ఆమోదమును తెలియజేయ ప్రార్థన . అర్హత కలిగిన వనితకు ఎన్నిక ఖాయం కాగానే తగినంత శుల్కం చెల్లించబడును. (గమనిక: "కన్యాశుల్కము" అనడం లేదు, ఏలనన, సదరు స్త్రీ కన్య అయివుండాలనే నిబంధన లేదు). కులం, మతం, అందం పట్టింపులు మాకైతే లేవు.*

✣ ✣ ✣

"చాలా అసందర్భంగా ఉంది" అనుకుంటున్నారు కదూ?

అలా అనుకోకూడదు.

ఇది కన్యాశుల్కం నాటకాన్ని తలుచుకుంటే స్ఫురించే కులాసా ఎపిసోడు కాదు.

రాబోయే ఈ పరిస్థితికి కారణాలు చాలా ఉన్నాయి. కన్యాశుల్కం నాటకం సజీవంగా ఉండిపోడానికి ఎన్ని కారణాలున్నాయో అంతకంటే ఎక్కువ ఉన్నాయి, అంతకంటే దీనిక్కూడా శక్తిమంతమైన కారణాలున్నాయి.

ఎనిమిదవ, తొమ్మిదవ, పదవ పంచవర్ష ప్రణాళికలు చూడండి. రెండున్నర లక్షల కోట్లు, మూడు లక్షల కోట్లు, ఐదు లక్షల కోట్లు రూపాయలు ఖర్చు చేస్తుందిట ప్రభుత్వం. ఫలితంగా వ్యక్తిగత ఆదాయం (అంకెల్లో ) బాగా పెరుగుతుంది.

1981, 1991, 2001 జనాభా లెక్కలు చూడండి. ప్రతి వెయ్యి మంది పురుషులకి 933 మంది, 850 మంది, 720 మంది మాత్రమే స్త్రీలుంటారు.

"పుట్టబోయే బిడ్డ మగా, ఆడా...?" అనేది అల్ట్రాసానిక్ వైద్య పరికరాలవల్ల తెలుసుకొని,

స్త్రీ శిశువులను పుట్టకముందే (భ్రూణ) హత్యలకు గురి చేస్తారు.

కొన్ని జాతులవారు , కొన్ని కులాలవారు ... తమ సంప్రదాయాలను అనుసరించి... స్త్రీ శిశువులను పుట్టాక చంపివేస్తారు. (ఈ రెండు రకాల నేరాలకు శిక్షలు లేవు.)

పరిస్థితులు ఇలా రూపొంది ఉత్తరోత్రా స్త్రీ అనేది అభ్యత తగ్గే పదార్థమని గ్రహించలేని పురుషులు కొందరు; కట్నాల కారణంగానో, శీలప్రవర్తనల మీద అనుమానాల కారణంగానో (బిడ్డల్ని కనగల వయసులో ఉన్న) స్త్రీలను చంపివేస్తారు.

పోలీసుల చేత, లేదా రౌడీలు రాజకీయులు మొదలైన వారి చేత, మాన భంగాలకు గురి అయ్యే పరువపు వయస్సు స్త్రీలు ఆత్మహత్యలకు పాల్పడతారు.

ఎంత రేటు ఉన్నా కొనుక్కోగల రెడ్‌లైట్ ఏరియాల వాళ్లు కొందర్ని కొనేసుకుంటారు. ఇలా, "కుటుంబ జీవితానికి" అనువయ్యే స్త్రీల సంఖ్య (లభ్యత) తగ్గిపోతుంది.

కుటుంబ వ్యవస్థలో స్త్రీ మనుగడ అధమాధమంగా వుందన్న ప్రబోధం తలకెక్కు తుంది.

వివాహ వ్యవస్థలో భద్రత తక్కువ అయిపోతున్న కొలదీ, స్త్రీలు; విద్యా, విజ్ఞానాల ప్రభావం చేత "మేం విడిగా కూడా బతగ్గలం" ధోరణిలో ఆలోచించి క్రమంగా గృహిణీత్వాన్ని నిరసించి, స్వతంత్రంగా సంపాదించుకోవడం బ్రతకడం అలవర్చుకొని; పురుషుల మీద ఎంత వరకు ఆధారపడాలి, వారిని ఎంత దూరంలో ఉంచాలి, గిరాకీ గల వస్తువు ధర ఎలా పెంచాలి- అనేవి తెలుసుకొని ఆచరిస్తారు.

"అబద్ధాలాడినా సరే ఆడపిల్లలు పుట్టరు..."

మళ్లీ కన్యాశుల్కంలో మాటే తేవాలి. "పెయ్యతోటొచ్చిన ఆవు మేలు కాదా!" అని ఆలోచించి, పురుషులు స్త్రీల కోసం చెల్లించే శుల్కాన్ని పెంచుకుంటూ పోవచ్చు. పెద్ద కష్టం ఏమీ ఉండదు. డబ్బు పెరుగుతోందిగా. లక్ష అంటే రెండక్షరాలే కాని "జీవిత సహచరిణి" "సహధర్మచారిణి" అంటే ఇంకా ఎక్కువ అక్షరాలు కదా!

తస్మాత్ జాగ్రత్త!

*

*("ఆంధ్రభూమి" డెయిలీ: 28-11-1990)*

*With the best compliments from ...*

**Estd. 1980**

**Phone : 547044**
**548182**

# WALTAIR CHIT FUND (P) LTD

**Door No. 47-7-24; I Floor: Seshu Apartments**
**4th Line, Dwaraka Nagar**
**VISAKHAPATNAM- 530 016**

## OUR RUNNNING GROUP PARTICULARS

| Subscription | Months | Members | Value |
|---|---|---|---|
| Rs. | | | |
| 1,000 | 25 | 25 | 25,000 |
| 1,000 | 50 | 50 | 50,000 |
| 2,000 | 50 | 50 | 1,00,000 |
| 3,000 | 50 | 50 | 1,50,000 |
| 4,000 | 50 | 50 | 2,00,000 |
| 5,000 | 50 | 50 | 2,50,000 |
| 6,000 | 50 | 50 | 3,00,000 |
| 10,000 | 50 | 50 | 5,00,000 |

**K. SITHARAMA RAJU**
***Managing Director***

**M. APPALARAJU**
***Executive Director***